TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 252 | గురువారం 2 జనవరి 2025 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



## ఎంసిటిబి చర్చిలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

**విల్లివాకం న్యూస్:** చెన్నై వేపేరిలో గల మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరుకు చెందిన సువార్తికులు బ్రదర్ విలియం తాళ్లూరి విచ్చేసి నూతన సంవత్సర సందేశాన్ని వినిపించారు. ఆయన ప్రసంగిస్తూ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఒక తీర్మానాన్ని గైకొనాలని కోరారు. దేవుని పట్ల విశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు. ఆయన ఈ ఏడాదిలో మెండుగా దీవెనలు అందజేస్తారని తెలిపారు. ముందుగా ఆయనను కార్యదర్శి పి. ప్రభుదాస్ శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంసిటిబి చర్చి సువార్తికులకు బ్యాడ్జీలను ప్రదానం చేశారు. అలాగే గతంలో



కోశాధికారిగా పనిచేసిన ఏ. బాబు కుటుంబాన్ని సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ జి. రామయ్య కోశాధికారి ఐ. మార్క్ కార్యవర్గ సభ్యులు రాజయ్య మార్కు, రాజా, విశ్వ పాల్గొన్నారు.



## ఘనంగా టిటిసిప తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



**విల్లివాకం న్యూస్:** తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం నూతన సంవత్సరం-2025 తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ టిటిసిఏ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య విచ్చేసి క్యాలెండర్ ను ఆవిష్కరించారు. మొదటి ప్రతిని గాయని ఎల్ వసుంధరా దేవి అందుకున్నారు. ఈ సందర్భంగా గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ నూతన సంవత్సరంలో తెలుగు ప్రజలందరికీ సర్వ శుభాలు చేకూరాలని అభిలషించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అధ్యక్షులు తమ్మినేని బాబు మాట్లాడుతూ తమ సంస్థను 1977 లో ప్రారంభించామని, ఇది 48వ సంవత్సరం అన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా నూతన సంవత్సర తెలుగు క్యాలెండర్ ను ముద్రించి తెలుగు ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పిఆర్ కేశవులు, విజయసారథి పాల్గొన్నారు.

## ఇండియన్ అవార్డ్స్ 2024 ప్రదానం

**విల్లివాకం న్యూస్:** ఇండియన్ మీడియా వర్క్స్ ఆధ్వర్యంలో ఇండియన్ అవార్డ్స్ 2024 విలేకరుల సమావేశం చెన్నైలోని ఓ హొటల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇండియన్ మీడియా వర్క్స్ ఎండి జాన్ అమలన్, జయశీలన్, ఐడిఎఎస్ - కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (రక్షణ మంత్రిత్వ శాఖ) ప్రత్యేక అతిథిగా, ఇండియన్ అవార్డ్స్ 2024 గ్రహీతలు హాజరయ్యారు.

ఇండియన్ అవార్డ్స్ 2024 అవార్డులు సినిమా, టెలివిజన్, రాజకీయాలు, సామాజిక సేవ మొదలైన వివిధ రంగాలలో స్ఫూర్తిగా నిలిచిన వారికి అందించబడ్డాయి. అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా, ఇండియన్ మీడియా వర్క్స్ ఎండి జాన్ అమలన్ మరియు అమరన్ చిత్ర దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి, సర్వీస్‌లో ఉన్నప్పుడు శారీరకంగా బాధపడ్డ భారత ఆర్మీ సైనికుల కుటుంబాలకు రూ.1,00,000 విరాళాన్ని అందించారు. ఇండియన్ మీడియా వర్క్స్ ఎండి జాన్ అమలన్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఇండియన్ అవార్డ్స్ 2024 వేడుక చాలా విజయవంతమైందని, ఈ వేడుకలో హైలైట్‌గా డైనమిక్ లీడర్ ఆఫ్ తమిళనాడు పాలిటిక్స్ అనే అవార్డును గౌరవనీయ మంత్రి ఎం. మదివెందన్‌కు అందజేశామని తెలిపారు. దివంగత నటుడు విజయకాంత్‌కు భారతీయ సినిమాలో గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ అనే అవార్డును అందజేయగా, ఆయన తరపున ఆయన సతీమణి ప్రేమలత విజయకాంత్ అందుకున్నారు.

ప్రేమలత విజయకాంత్ నటుడు మరియు




కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్‌కు పురట్చి కలైంజర్ కెప్టెన్ విజయకాంత్ అవార్డును అందజేసారు, అలాగే ఐడిఎఎస్ - డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ (రక్షణ మంత్రిత్వ శాఖ) శ్రీ జయశీలన్‌కు 'ప్రైడ్ ఆఫ్ తమిళనాడు' అవార్డు లభించిందని ఆయన అన్నారు. విదుతలై చిరుతైగల్ కట్చి ప్రెసిడెంట్ తోల్.తిరుమావళవన్ ఐకాన్ ఆఫ్ సోషల్ లిబరేషన్‌గా యువత రాజకీయ విశ్వాసానికి అవార్డు విడుతలై చిరుతైగల్ కట్చికి చెందిన మోనిశ్వరన్‌కు లభించింది.

## వికలాంగులకు సహాయకాల పంపిణీ




**విల్లివాక్కం న్యూస్:** గాడ్స్ లవ్ టు ది నీడీ సోషియల్ వెల్ఫేర్ ట్రస్ట్, విల్లివాకం ఆధ్వర్యంలో నూతన సంవత్సరము సందర్భంగా 100 మంది వికలాంగులకు రూ. 1,000 విలువగల కిరాణా వస్తువులను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు వి. డి. శామ్యూల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా విలివాక్కం పోలీస్ ఇన్స్పెక్టర్. తిరునావుక్కరసు, టామ్స్ వ్యవస్థాపకు లు గొల్లపల్లి ఇజ్రాయేల్, టామ్స్ అధ్యక్షుడు ఎన్. విజయ కుమార్, టామ్స్ ఉపాధ్యక్షుడు పూటుకూరి దేవ దానం, సింగారంపిల్లై హెడ్ మాస్టర్ అలగువేల్, ఎహెచ్ఎం సిందనై సెల్వన్, వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరువళ్లూరు జిల్లా అలాడు శివపురం సాయిబాబా ఆలయంలో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహణ

**పొన్నేరి న్యూస్ :** తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని అలాడు శివపురం గ్రామంలో ఉన్న అరుల్మికు శ్రీ సిరాడి శివపురం సాయినాథ మందిరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. బాబాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున క్యూలో నిలబడి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం నూతన సంవత్సరాది సందర్భంగా ఈ ఆలయంలో విశేష అలంకరణలతో ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించ బడుతాయి. ఈ సంవత్సరం తెల్లటి పూలతో అలంకరించిన తోరణాలు ఏర్పాటు





చేయడం, అర్ధరాత్రి నుంచే ఉత్సవాలకు నాంది పలకడం విశేషంగా నిలిచాయి. తెల్లవారుజామున కాకడ హారతితో ప్రారంభమైన ఈ వేడుకలు, మధ్యాహ్నం గణపతి ఓమం, బాబా ఆరతులు, అన్నదానం వరకు కొనసాగాయి. రాత్రి జరిగిన బాబా మాల హారతి మరియు నాట్యాంజలి పాఠశాల విద్యార్థుల భరతనాట్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. చెన్నై, కాంచీపురం, చెంగల్‌పట్టు సహా పలు జిల్లాల నుంచి, తిరువళ్లూరు జిల్లా వివిధ ప్రాంతాల నుంచి మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీ సిరాడి శివపురం సాయినాథ మందిరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో, పొన్నేరి మాజీ శాసనసభ్యులు సిరునియం బలరామన్ ప్రత్యేక అతిథిగా పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

## మధురైలో నూతన సంవత్సరం రోజు మీనాక్షి అమ్మన్ ఆలయం ముందు ప్రేమ వివాహం



**అన్నా నగర్ న్యూస్** : దేశవ్యాప్తంగా ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధురై జైహింద్‌పురం ప్రాంతానికి చెందిన ప్రేమజంట కామాక్షి మరియు దార్నిక, నూతన సంవత్సరం రోజున ప్రపంచ ప్రఖ్యాత మీనాక్షి అమ్మన్ ఆలయం ముందు వివాహం చేసుకున్నారు. ఈ ప్రేమికులు గత 4 ఏళ్లుగా ప్రేమలో ఉన్నారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఈరోజు వివాహం జరిగింది. ప్రియు డికి ప్రియుడు మాంగల్య తాడు కట్టినప్పుడు, ఆలయానికి వచ్చిన స్నేహితులు, కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు మరియు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే రోజున మా వివాహం జరగడం ఎంతో ఆనందంగా ఉంది. మీనాక్షి దేవి ఆశీస్సులతో మా జీవితాలు సంతోషంగా ఉంటాయని భావిస్తున్నాం" అని నూతన దంపతులు తెలిపారు. "కుటుంబ సభ్యుల ప్రేమ, మీనాక్షి అమ్మవారి ఆశీస్సులతో మా వివాహం పూర్తయ్యింది. ఈ ప్రత్యేక రోజున మా కొత్త జీవితం ప్రారంభమైనందుకు ఆనందంగా ఉంది," అని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పొంగల్ పండుగ కోసం చెరకు పంపిణీ



**గిండీన్యూస్** : పొంగల్ పండుగ సందర్భంగా ప్రజలకు పొంగల్ ప్యాకేజీతో పాటు ఒక చెరకు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో, ప్రభుత్వం నేరుగా పన్నీర్ రకం చెరకు కొనుగోలు చేసి రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తోంది. అరియలూర్, కడలూరు, ధర్మపురి, దిండిగల్, ఈరోడ్, కళ్లకురిచ్చి, కృష్ణగిరి, మదురై, మైలదుత్తురై, నామక్కల్, పెరంబలూరు, పుదుకోట్టై, సేలం, శివగంగై, తంజావూరు, తేని, తిరువూరు తదితర జిల్లాల్లో మొత్తం 3 కోట్ల 19 లక్షల 41 మంది ప్రజలకు పొంగల్ ప్యాకేజీలు అందించాల్సి ఉంది. రేషన్ దుకాణాలకు 2.25 కోట్ల చెరకు అవసరమవుతుండగా, పంట పొలాల్లో తగినంత చెరకు నిల్వ ఉంది. కోఆపరేటివ్ ఫుడ్ అండ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి డాక్టర్ జె. రాధాకృష్ణన్ విల్లుపురం జిల్లాలో పర్యటించి పన్నీర్ రకం చెరకు సాగును పరిశీలించారు. చెరకు నాణ్యతను పరీక్షించడంతో పాటు, రైతులతో సమావేశమై వారితో చర్చలు నిర్వహించారు. ఈ పర్యటనలో సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్ విజయశక్తి, జేఆర్ స్వర్ణలక్ష్మి, నందకుమార్, జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, మనో తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిద్ధాంతి సత్యనారాయణ చౌదరి మృతి

**నల్లజర్ల** : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం సింగరాజుపాలెంకు చెందిన జ్యోతిష్య, వాస్తు పండితుడు, సినిమాల ముహూర్త సిద్ధాంతి కొఠారు సత్యనారాయణ చౌదరి(75) బుధవారం కన్నుమూశారు. 4 రోజులుగా తీవ్ర జ్వరంతో జూబ్లీ హిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో కోలుకోలేకపోయారని వైద్యులు తెలిపినట్లు బంధువులు వివరించారు. స్వగ్రామంలో గురువారం ఉదయం అంత్య క్రియ లు జరుగుతాయని తెలిపారు. ఆయనకు భార్య అనసూయ, కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె నాగమణి ఉన్నారు. రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక, సినీ, క్రీడాంశాలపై జ్యోతిష్యాన్ని ఆయన విశ్లేషిస్తారు.

## శ్రీహరిహర దేవాలయంలో అఖండ శరణు ఘోష - ఏకాహం



**జ్యోతినగర్, 01 జనవరి** : స్థానిక ఎన్టిపిసి టౌన్షిప్ లోని శ్రీహరిహర దేవాలయం ఆవరణలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఈరోజు ఉదయం 8 గంటల నుండి శ్రీఅయ్యప్ప స్వామి అఖండ శరణు ఘోష కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ రాంపల్లి వామన శర్మ గారు ప్రారంబించారు. ఇందులో అఖండ కర్పూర హారతి తో పాటు స్వామివారి కి పుష్పాభిషేకం, 12 గంటల కర్పూర హారతి నీరాజనం ( ఏకాహం )చేయడం జరిగింది. అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ తిరుపతి గారి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో చిలకలయ్య ఆలయ గురుస్వామి ప్రభాకర్ గురుస్వామి గారు, గౌతమి నగర్ శ్రీ అయ్యప్ప దేవాలయం గురుస్వామి అనుమ భద్రయ్య గురు స్వామి,గోదావరిఖని అయ్యప్ప ఆలయ గురు స్వామి హనుమంతరావు గురుస్వామి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యవర్గ సభ్యులు చల్లా రవీందర్ రెడ్డి, తుమ్మ సురేష్ కుమార్, శ్రీనివాస్ సమ్మయ్య గారితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పి సంపత్ రావు, గిరి,యార రాము,భరత్ స్వామి, చెంద్రశేఖర్ స్వామి, రామాకాంత్,శ్రీనివాస్, సమ్మయ్య తో పాటు హరి హర దేవాలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు



## తెదేపా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహణ




**ఒంగోలు న్యూస్:** ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 2025 నూతన సంవత్సర వేడుకలు వైభవంగా నిర్వహించబడ్డాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొ న్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ గారిని పార్టీ శ్రేణులు పుష్ప గుచ్ఛాలు మరియు శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఆయన ఈ సందర్భంగా నూతన సంవ త్సర శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. తదుపరి ప్రసంగంలో, ప్రజా సమస్యలపై చొరవగా పనిచేయడం మరియు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్ల డం అనివార్య మని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా పరిషత్ ఉద్యో గులు, పంచాయతీ రాజ్ ఉద్యోగులు, టీచర్ సంఘా ల నాయకులు, తెలుగుదేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, నియోజ కవర్గ స్థాయి నాయకులు, మండ లాధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్-యూనిట్-బూత్ ఇంచార్జులు, అనుబంధ విభాగాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా యువత మరియు మహిళా నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




## జి.కె.వాసన్‌కు శుభాకాంక్షలు



**విల్లివాకం న్యూస్:** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తమిళ మానిల కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షులు జి.కె.వాసన్ కు ప్రధాన కార్యదర్శి జి.ఆర్.వెంకటేష్ శాలువ కప్పి శు భాకాంక్షలు తెలిపారు. ఇందులో కార్యవర్గ సభ్యులు శక్తి వడివేల్, ప్రొఫెసర్ బాషా, చంద్రన్, జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, నందు, మలయప్పూర్ పురుషోత్తమన్, వేలచ్చేరి కెపి లూయిస్, బిజు చాకో, న్యాయవాది శంకర్ మరియు మయిలై టి. వివేక్, మయిలై ఎస్.ఎమ్ వేద, ట్రస్టుపురం ఉదయరాజ్, టైల్స్ మురుగన్ అన్నానగర్ దినేష్ ఎస్ ఆర్ కేజిల్ రవి తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ విలువల పెంపు ప్రతిపాదనల పునఃపరిశీలన

**అమరావతి:** జిల్లా కమిటీలు ఆమోదం తెలిపిన రిజిస్ట్రేషన్ విలువల పెంపు, తగ్గింపును మరోమారు పరిశీలించాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు షెడ్యూలు ప్రకటించింది. కొత్త విలువలను రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అధికారులు ఈ నెల 10న మరోమారు పరిశీలించాలి. వీరు ఖరారు చేసిన విలువలను జిల్లా కమిటీలు 17న పరిశీలిస్తాయి. మరుసటి రోజు ప్రజలకు తెలియపరిచేలా వెబ్‌సైట్‌లో పెడతారు. ఈనెల 24 వరకు అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలిస్తారు. 25న వీటికి జిల్లా కమిటీలు ఆమోదముద్ర వేస్తాయి. ఫిబ్రవరి ఒకటి నుంచి కొత్త విలువలను అమల్లోకి తీసుకురావాలని రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐజీ శేషగిరిబాబు జిల్లాలకు తాజాగా పంపిన ఆదేశాల్లో పేర్కొన్నారు. విశాఖ నగరంలో చదరపు గజం విలువను రూ.72 వేల నుంచి రూ.1.20 లక్షలకు, రుషికొండలో రూ.25 వేల నుంచి రూ.30 వేలు, గాజువాకలో రూ.22 వేల నుంచి రూ.32 వేలు, అశీల్‌మెట్టలో రూ.72 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెంచుతూ ప్రతిపాదించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చదరపు గజం రూ.3 వేలు ఉంది. ఇక్కడ రూ.5 వేలు పెంచడానికి ప్రతిపాదించారు. వాణిజ్య(కమర్షియల్) ప్రాంతాల్లో చదరపు గజం విలువను రూ.7 వేలు నుంచి రూ.9 వేలకు పెంచాలని ప్రతిపాదించారు. నక్కపల్లి ప్రాంతంలో ఈ ఏడాది ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్క్ పనులు మొదలు కానున్నాయి. భవిష్యత్తులో జరగబోయే అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ విలువలను పెంచారు. గుంటూరు లక్ష్మీపురం ప్రధాన రహదారిలో చదరపు గజం రూ.85 వేల నుంచి రూ.93 వేలు, బృందావన్ గార్డెన్స్‌లో రూ.85 వేల నుంచి రూ.95 వేలు, గోరంట్లలో రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని ప్రతిపాదించారు. గుజ్జనగుండ్ల, చుట్టుగుంట ప్రధాన రహదారి, ఎన్జీఓ కాలనీ, ఇతరచోట్ల పెంపు స్వల్పంగా ఉంది. తిరుపతి జిల్లా రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో కొత్తగా రహదారులు ఏర్పాటు చేశారు. తిమ్మి నాయుడుపాలెం కాటన్‌మిల్లు వద్ద గజం స్థలం విలువ రూ.10 వేలు ఉంటే రూ.19 వేలుగా ప్రతిపాదించారు. ఎలమండ్యం, అన్నాసామిపల్లె పరిధిలో గజం విలువ రూ.4 వేలు కాగా దాన్ని రూ.4,500 చేసే అవకాశం ఉంది. ఒంగోలులోని లాయర్‌పేట, తదితక కాలనీల్లో రహదారుల వెంట వాణిజ్య స్థలాల్లో చదరపు గజం విలువ గరిష్ఠంగా రూ.45 వేలు కాగా.. రూ.49 వేలుగా ప్రతిపాదించారు. ముక్తినూతలపాడు గ్రామంలో ఎకరా విలువ రూ.40 లక్షలు ఉండగా.. రూ.42 లక్షలకు, కొప్పోలులో రూ.24 లక్షల నుంచి రూ.26 లక్షలకు ప్రతిపాదించారు. విజయవాడ పటమట సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని పటమట లంకలో ప్రస్తుతం గజం రూ.46 వేలు కాగా రూ.49 వేలు కానుంది. నీ ఎంజీ రోడ్డులో గజం రూ.1.06 లక్షల నుంచి 1.10 లక్షలు అవుతుంది.

# ప్రీమియం భారం.. బీమాకు దూరం

**అమరావతి:** గతేడాది ఇదే రబీ సీజన్‌లో పంటల బీమాలో నమోదైన రైతుల సంఖ్య ఏకంగా 43.82 లక్షలు.. మరిప్పుడు.. కేవలం 5.94 లక్షలు.. ఏడాదిలో ఎంత తేడా! లక్షల ఎకరాలు.. లక్షలాది మంది రైతన్నలు బీమా రక్షణకు దూరమై గాలిలో దీపంలా సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది.. గత ఐదేళ్లూ అన్నదాతలపై పైసా భారం పడకుండా డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసింది. ఎక్కడా తిరగాల్సిన అవసరం లేకుండా ఈ%-%క్రాప్ ప్రామాణికంగా గ్రామంలోనే పని పూర్తయ్యేది.

నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు నూరు శాతం యూనివర్శల్ కవరేజ్ కల్పిస్తూ పంటల బీమా కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకంతో ఉచితంగా లబ్ధి చేకూరేది. రైతన్నలు నిశ్చింతగా పొలం పనుల్లో నిమగ్నమైతే కావాల్సిన కాగితాలు.. మిగతా ప్రక్రియ విషయాన్ని గ్రామ సచివాలయాలు, వలంటీర్లు దగ్గరుండి చూసుకునేవారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 54.55 లక్షల మంది రైతన్నలకు పంటలు నష్టపోతే రికార్డు స్థాయిలో రూ.7,802.05 కోట్లు పరిహారంగా అందచేసి సాగుకు అండగా నిలిచింది. ఇప్పుడు వరికి పంటల బీమా వర్తించాలంటే హెక్టార్‌కు రూ.1,575 చొప్పున రైతన్నలు తమ చేతి నుంచి ఖర్చు పెట్టుకోవాలి. పనులు మానుకుని బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిరగాలి. రోజుల తరబడి పడిగాపులు కాయాలి. అసలు బీమా పథకానికి ఎప్పటిదాకా గడువు ఉందో చెప్పేవారు లేక.. ఈ అవస్థలు భరించలేక.. డబ్బులు కట్టలేక ఎంతో మంది ఈ పథకానికి దూరమయ్యారు. టీడీపీ కూటమి సర్కారు నిర్వాకాలతో అన్నదాతలు అన్యాయమైపోయారు! ఐదేళ్ల పాటు పైసా భారం పడకుండా అమలైన ఉచిత పంటల బీమా పథకం ద్వారా పూర్తి స్థాయిలో రక్షణ పొందిన రైతన్నలంతా నేడు ప్రీమియం భారాన్ని భరించలేక, పంటల బీమా చేయించుకోలేక గగ్గోలు పెడుతున్నారు.

రబీ-2024-25 సీజన్‌లో దిగుబడి ఆధారిత పంటల బీమా పథకం కింద 13 పంటలను, వాతావరణ ఆధారిత పంటల కింద 3 పంటలను నోటిఫై చేశారు. జీడి మామిడి పంటకు ప్రీమియం చెల్లింపు గడువు నవంబర్ 15వ తేదీతోనే ముగియగా వరి మినహా మిగతా వాటికి ఈ నెల 15తో గడువు ముగిసింది. వరితో పాటు ఇటీవలే నోటిఫై చేసిన మామిడి పంటకు ఈ నెల 31వతేదీతో గడువు ముగియనుంది. దిగుబడి ఆధారిత పంటల బీమా కింద నోటిఫై చేసిన సాగు విస్తీర్ణం 45.55 లక్షల ఎకరాలు కాగా వాతావరణ ఆధారిత పంటల బీమా కింద నోటిఫై చేసిన జీడిమామిడి, మామిడి, టమాటా పంటల సాగు విస్తీర్ణం 15 లక్షల ఎకరాలు.. అంటే రెండూ కలిపి 60.55 లక్షల ఎకరాల పైమాటే. కానీ ఇప్పటి వరకు పంటల బీమా కవరేజ్ పొందిన విస్తీర్ణం కేవలం 8.44 లక్షల ఎకరాలు మాత్రమే కావడం గమనార్హం.

వీటిలో వాతావరణ పంటల బీమా కింద 24,550 ఎకరాలు, దిగుబడి ఆదారిత పంటల బీమా కింద 8.20 లక్షల ఎకరాలలో సాగైన పంటలకు మాత్రమే బీమా కవరేజ్ పొందగలిగారు. రైతుల పరంగా చూస్తే ఈ రబీలో కేవలం 5,94,336 మంది మాత్రమే బీమా చేయించుకోగలిగారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా తీరు ఎలా ఉందో చెప్పేందుకు ఇదే నిదర్శనం.

పంటల బీమా వర్తించాలంటే గరిష్టంగా హెక్టార్‌కు మామిడికి రూ.5,625, జీడి మామిడికి రూ.3,837.50, టమాటాకు రూ.3,775, వరికి రూ.1,575 చొప్పున బీమా ప్రీమియాన్ని చెల్లించాలి. ఇతర పంటలకూ అదే స్థాయిలో ప్రీమియం భారం పడుతోంది. ఇంత భారం భరించలేక పంటల బీమాకు దూరం అవుతున్నట్లు అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లూ ఈ - క్రాప్ నమోదు ప్రామాణికంగా నోటిఫై చేసిన పంటలకు ఉచితంగా నూరు శాతం పంటల బీమా కవరేజ్ కల్పించింది. రబీ 2023-24 సీజన్‌లో 37.80 లక్షల ఎకరాల్లో సాగైన నోటిఫైడ్ పంటలకు బీమా కవరేజ్ కల్పించడంతో 43.82 లక్షల మంది బీమా రక్షణ పొందగలిగారు.

టీడీపీ కూటమి సర్కారు పగ్గాలు చేపట్టిన మరుక్షణమే రైతుల మదిలో వైఎస్ జగన్ ముద్రను చెరిపివేయాలనే అక్కసుతో ఉచిత పంటల బీమా పథకాన్ని నిలిపివేసింది. పంటల బీమా అమలులో రైతులను భాగస్వాములను చేస్తామని చెబుతూ పెనుభారం మోపింది. స్వచ్ఛంద నమోదు పద్ధతిలో పంటల బీమాకు శ్రీకారం చుట్టింది. చివరకు అవగాహన కల్పించలేక చేతులెత్తేసింది.

పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును జనవరి నెలాఖరు వరకు పెంచాలన్న రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కేంద్రం పట్టించుకోలేదు. దీంతో రబీ సీజన్ ప్రారంభంలో విరుచుకుపడిన ఫెంగల్ తుపాన్‌తో పాటు ఇటీవల అల్పపీడన ప్రభావంతో కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న రబీ పంటలకు బీమా పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది. దురదృష్టవశాత్తూ సీజన్ ముగిసేలోగా మరేదైనా విపత్తు సంభవిస్తే తమ పరిస్థితి అగమ్యగోచరమేనని అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

1965లో కేంద్రం రూపొందించిన క్రాప్ ఇన్‌స్రూటన్స్ బిల్లు ఆధారంగా తెచ్చిన మోడల్ ఇన్‌స్రూటన్స్ పథకం వివిధ రూపాలు మార్చుకుని 2016 నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)గా అమలవుతోంది. దీని ప్రకారం నోటిఫై చేసిన వ్యవసాయ పంటలకు ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం చొప్పున ప్రీమియాన్ని రైతులు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించేవి. అయితే ప్రీమియం భారం అధికంగా ఉండడం, ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లేక రైతులు సొంతంగా బీమా చేయించుకునేందుకు ముందుకొచ్చేవారు కాదు. రుణాలు తీసుకుంటే మాత్రం బ్యాంకులు ప్రీమియం రూపంలో నిర్దేశిత మొత్తాన్ని మినహాయించుకునేవి. లక్షలాది మంది రైతన్నలు తాము పండించిన పంటలకు బీమా చేయించుకోలేకపోవడంతో విపత్తుల బారిన పడితే తీవ్ర నష్టాల పాలయ్యేవారు. గతంలో బీమా చేయించుకున్న వారు సైతం ఎంతొస్తుందో? ఎప్పుడొస్తుందో తెలియక ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే ఈ దుస్థితిని తొలగిస్తూ చర్యలు చేపట్టింది. ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు పూర్తికాగానే ఉచిత పంటల బీమా పథకం వర్తించే నోటిఫై చేసిన పంటలను (స్టార్ గుర్తు) ప్రత్యేకంగా తెలియచేస్తూ రైతులకు భౌతిక రసీదులు అందచేసింది.

# కాలుష్యంలేని నగరాలు

**ఢిల్లీ :** దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రధాన నగరాల్లో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న విషయం తెలిసిందే. ఢిల్లీ, యూపీ, నోయిడా, లక్నో సహా పలు ప్రధాన నగరాల్లో గాలి నాణ్యత సూచీ క్షీణించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 450కుపైనే నమోదవుతోంది. తీవ్ర వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కళ్ల మంటలు, తలనొప్పి వంటి పలు అనారోగ్య పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ఇదే సమయంలో పలు నగరాలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటున్నాయి. దేశం లోని దాదాపు తొమ్మిది నగరాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చాలా మంచి కేటగిరీలో ఉంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. అతి తక్కువ కాలుష్య నగరాల జాబితాలో మిజోరాంలోని ఐజ్వాల్ తొలి స్థానంలో ఉంది. ఐజ్వాల్‌లో గాలి నాణ్యత సూచీ 26 వద్ద నమోదైంది. దీన్ని మంచి కేటగిరీ కింద భావిస్తారు. దీంతో అక్కడి నివాసితులు స్వచ్ఛమైన గాలిని పీలుస్తూ.. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఆస్వాది స్తున్నారు. ఐజ్వాల్ తర్వాత సిక్కింలోని గ్యాంగ్‌టక్, మేఘాలయాలోని షిల్లాంగ్ వరుసగా రెండు, మూడు స్థానాలో నిలిచాయి. ఈ నగరాల్లో ఏక్యూఐ లెవల్స్ వరుసగా 35, 36 వద్ద నమోదయ్యాయి. ఆ తర్వాత అస్సాంలోని గువాహటిలో 40, కర్ణాటకలోని చామరాజనగర్ 41, బాగల్‌కోట్‌లో 42, కేరళ త్రిస్సూర్‌లో 43, అరుణాచల్ ప్రదేశ్‌లోని నహర్లగన్‌లో 51, అస్సాం నాగాన్ నగరంలో ఏక్యూఐ లెవల్స్ 53తో సంతృప్తికరంగా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీ అత్యంత కాలుష్య నగరాల్లో తొలి స్థానంలో ఉంది. ఇక్కడ గాలి నాణ్యత సూచీ తీవ్రమైన కేటగిరీలో నమోదైంది. బుధవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 422 వద్ద నమోదైంది. మంగళవారంతో పోలిస్తే.. నేడు ఏక్యూఐ లెవల్స్ 494 నుంచి 422కి పడిపోయింది. అయినప్పటికీ ఇంకా ప్రమాదకర విభాగంలోనే ఉంది.

Work From Home
ఇంట్లోనే ఉంటూ నెలకు
20,000 నుంచి 50,000
వరకు సంపాదించుకునే
మంచి అవకాశం కలదు
Male & Female
22 Years ఉన్నవాళ్లు అందరూ అర్హులే
Ph : 6303158807
మాట్లాడే విధానం బాగుండాలి, & కనీసం 3 గంటలు పని చేస్తాను అని అనుకున్న వాళ్ళు మత్రమే కావాలి & distabance ఉండకూడదు, నిజంగా కష్టాల్లో ఉన్నవాళ్లు లేదా జాబ్ చేస్తు ఇది part time గా చేసుకొని డబ్బులు సంపాదించాలి అని అనుకున్న వాళ్లు మత్రమే Contact అవ్వండి Thank you

With best compliments from
Rtn, J.S.K. Naidu
Proprietor
9840066772

NATIONAL INDUSTRIAL SECURITY AGENCY
Specialized in security services
The best & Reliable Security Services for
Institutions
Industries
Commercial Offices
Apartments
Bungalows
Hospitals
Banks
Bouncer Ceremonial Functions & Events

SECURITY SERVICES (P) LTD
Specialized in investigation of

Matrimonial
Thefts
Finger Prints
Pre & Pro Bio Data of Employees
Company records of Employees
No.28/24, 1st Main Road, Jai Nagar, Arumbakkam, Ch-106
Ph: 044-43531187 | Mobile: 98400 39394 | 98400 28888
E-Mail: nisaagency01@gmail.com
15

# నగరాలు నిండిపోతున్నాయ్..!

**అమరావతి:** నగరాలు నిండిపోతున్నాయి. సమీప గ్రామాలు సైతం పట్టణాల్లో విలీనమవుతున్నాయి. మరో పదేళ్లల్లో దేశజనాభాలో 40 శాతం పట్టణాల్లోనే స్థిర నివాసం ఏర్పరచుకుంటారని కేంద్రం అంచనా వేస్తోంది. దీనికి తగ్గట్టుగా చర్యలు తీసుకోకపోతే ప్రమాదమని కేంద్రం భామిస్తోంది. దీంతో పట్టణీకరణపైనా, మౌలిక సదుపాయాల కల్పుున పైనా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టి పెట్టింది. పట్టణీకరణపై అధ్యయనం కోసం ప్రత్యేుకంగా కమిటీని వేయడంతో పాటు వచ్చే ఐదు దశాబ్దాలు మన నగరాలు ఎలా అభివృద్ధి చెందాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేస్తోంది. 2022లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఇటీవల తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. దీనిప్రకారం 2036 నాటికి దేశంలో పట్టణ జనాభా 60 కోట్లకు చేరుతుందని, 2047 నాటికి 80 కోట్లకు పెరుగుతుందని అంచనా వేసింది. ఈ క్రమంలో పట్టణీకరణ సమీప భవిష్యత్‌లో అత్యవసరమని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా భవిష్యత్ నగరీకరణ ప్రణాళిక, సంస్కరణలను సిఫారసు చేసింది.

# కేంద్రం కంట్రోల్‌లో ‘ఉపాధి’



**అమరావతి:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలును ఇకపై పూర్తిగా తన చేతుల్లోకి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఏ రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం కింద పనులు జరిగినా వాటికి సంబంధించిన అన్ని రకాల చెల్లింపులను నేరుగా కేంద్రమే ఆయా వ్యక్తులకు, సంస్థలకు చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుడుతోంది. తొలుత ఏడు రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయాలని నిర్ణయించింది. నూతన విధానం అమలులోకి వస్తే ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపులో ఇక రాష్ట్రాల పాత్ర నామమాత్రం కానుంది. రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం పనుల మంజూరు, పర్యవేక్షణకే పరిమితం కావాల్సి ఉంటుంది. ఉపాధి హామీ చట్టం నిబంధనల ప్రకారం పథకం అమలుకు రాష్ట్రాలు చేసే ఖర్చులో కనీసం 60 శాతం (ఏడాదిలో రూ.వంద కోట్లు ఖర్చు చేస్తే అందులో కనీసం రూ.60 కోట్లు) కూలీలకు వేతనాల రూపంలో చెల్లించేందుకు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఉపాధి హామీ కింద రాష్ట్రం వాటాగా చెల్లించాల్సిన నిధులను ఎప్పటికప్పుడు ఉమ్మడి ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. కూలీల వేతనాలు, మెటీరియల్ నిధులను రెండు వేర్వేరు కేటగిరీలుగా వర్గీకరించి 2006లో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

ఉపాధి హామీ పథకం కింద ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు దారి మళ్లించడంతోపాటు పలుచోట్ల అవినీతి చోటు చేసుకుంటోందన్న ఆరోపణల నేపథ్యంలో ఏడేళ్ల కిందట 2017-18లో కూలీలకు చెల్లించాల్సిన వేతనాలను వారి బ్యాంకు ఖాతాలకు కేంద్రమే నేరుగా చెల్లించే విధానాన్ని అమలులోకి తెచ్చింది. రాష్ట్రాల వారీగా కూలీల ద్వారా జరిగిన పనులకు అయ్యే మొత్తంలో గరిష్టంగా 40 శాతం మెటీరియల్ నిధులను కేంద్రం రాష్ట్రాలకు విడుదల చేస్తూ వస్తోంది. ఆయా నిధులతో రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నాయి. ఇక మీదట మెటీరియల్ కేటగిరీ నిధులను కూడా రాష్ట్రాలకు ఇవ్వకుండా కేంద్రమే నేరుగా చెల్లించే విధానాన్ని తీసుకురానుంది. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, అస్సాం రాష్ట్రాల్లో పైలెట్ ప్రాజెక్టుగా మెటీరియల్ కేటగిరీ నిధులను సైతం కేంద్రమే నేరుగా ఆయా వ్యక్తులు, సంస్థలకు చెల్లించే విధానాన్ని అమలు చేయనుంది. తొలుత మన రాష్ట్రంలో కూడా పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ భావించినా అనంతరం తొలగించినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నూతన విధానానికి సంబంధించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పది రోజుల క్రితమే రాష్ట్రాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. మెటీరియల్ కేటగిరీ నిధులను కూడా నేరుగా కేంద్రమే ఆయా వ్యక్తులు, సంస్థలకు చెల్లించే ప్రక్రియ మొదలైతే రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా ఇవ్వాల్సిన 25 శాతం నిధులను ఉమ్మడి ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏటా దాదాపు రూ.90 వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల దాకా ఉపాధి హామీ పథకం కింద పనులు జరుగుతుండగా, మన రాష్ట్రంలో ఏటా రూ.9 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల విలువైన పనులు నమోదవుతున్నాయి. ఇందులో దేశవ్యాప్తంగా మెటీరియల్ కేటగిరీ నిధుల వాటా ఏటా రూ.30 వేల కోట్ల దాకా ఉండగా, మన రాష్ట్రంలో దాదాపు రూ.ఐదు వేల కోట్ల దాకా మెటీరియల్ కేటగిరీ నిధులు ఉంటాయి. కేంద్రం కొత్త విధానాన్ని అమల్లోకి తెస్తే మన రాష్ట్రం ఏటా సుమారు రూ.1,250 కోట్ల వరకు ఎప్పటికప్పుడు ఉపాధి హామీ పథకం ఉమ్మడి ఖాతాకు నిధులు జమ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఆమరణ నిరాహార దీక్ష చేస్తా



**ఢిల్లీ :** బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో గత పది రోజులుగా నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. వీరిపై ఆదివారం పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. లాఠీఛార్జి చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థులపై పోలీసుల చర్యలను జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఖండించారు. పేపర్ లీక్‌పై పోరాడుతున్న యువతపై పోలీసులు అనుసరించిన వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. పోలీసుల చర్యలకు నిరసనగా జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని ప్రకటించారు.

**లాఠీఛార్జి జరిగినప్పుడు మీరు ఎక్కడికి వెళ్లారు?**

కాగా ఆదివారం రాత్రి పోలీసులు విద్యార్థులపై లాఠీఛార్జి చేస్తున్న సమయంలో ప్రశాంత్ కిశోర్ అక్కడినుంచి వెళ్లిపోతున్నట్లుగా పలు వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో విద్యార్థులకు, ఆయనకు మధ్య వాగ్వాదం నెలకొంది. తమపై పోలీసులు లాఠీఛార్జి చేసేటప్పుడు అక్కడ ఉండకుండా ఎందుకు వెళ్లిపోయారని అభ్యర్థులు ఆయనను ప్రశ్నించారు. నిరసన ప్రాంతం నుంచి ప్రశాంత్ కిశోర్ వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ.. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా విద్యార్థులు తనపై చేసిన ఆరోపణలను ప్రశాంత్ కిశోర్ ఖండించారు. వారి ఉద్యమానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పోలీసులు లాఠీఛార్జి చేస్తుండడంతో విద్యార్థులను అక్కడినుంచి వెళ్లాలని సూచిస్తూ తాను మరో చోటికి వెళ్లానన్నారు.

# ఇవీ మీ హక్కులు!

**యావత్ దేశాన్నీ కుదిపేసిన ‘కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటన’ నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం ‘అపరాజిత’ బిల్లును తీసుకొచ్చింది. మహిళలు - పిల్లలపై లైంగిక నేరాలు, వేగవంతమైన విచారణ, దోషులకు కఠిన శిక్షలు విధించడమే లక్ష్యంగా.. బెంగాల్ అసెంబ్లీలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అప్పుడెప్పుడో 2012లో జరిగిన ‘ఢిల్లీ హత్యాచార ఘటన’ సందర్భంగా ‘నిర్భయ’ చట్టం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు బెంగాల్ ప్రభుత్వం ‘అపరాజిత’ బిల్లును ఆమోదించింది.**

ఈ క్రమంలో ఎన్నో ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అసలు.. మహిళలు - చిన్నారులపై వేధింపులు, వారి రక్షణ కోసం జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో ఎలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి? వాటిలో ముఖ్యమైనవి ఏవి? మహిళలను రక్షించడానికి జాతీయ, రాష్ట్ర స్థాయుల్లో అనేక చట్టాలు రూపొందాయి. అయితే, ఆయా చట్టాలపై సరైన అవగాహన లేకపోవడంతో బాధితులు వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో భారతదేశంలోని ప్రతి మహిళా తెలుసుకోవాల్సిన ఏడు ముఖ్యమైన చట్టపరమైన హక్కుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**గృహహింసకు వ్యతిరేకంగా..** గృహహింస నిరోధక చట్టం - 2005.. మహిళలను ఇంట్లో ఎదురయ్యే హింస నుంచి రక్షిస్తుంది. గృహిణిపై చేయి చేసుకోవడమే కాదు.. ఆమెను మాటల ద్వారా, ఆర్థికంగా, భావోద్వేగాలపరంగా, లైంగికంగా వేధించినా.. 498 సెక్షన్ ప్రకారం దోషులను కఠినంగా శిక్షించవచ్చు.

**పనికి తగ్గ జీతం :** సమాన పనికి సమాన వేతనం పొందడం మహిళల హక్కు. మహిళా కూలీలు మొదలుకొని.. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల కోసం ‘సమాన వేతన చట్టం’ అమలులో ఉన్నది. పనిచేసే మహిళలు.. వారి సహోద్యోగులతో సమానమైన వేతనాన్ని ఈ చట్టం ద్వారా డిమాండ్ చేయొచ్చు. కూలీలు, ఉద్యోగినులకు వేతనాలు, ఇతర అలవెన్సుల విషయంలో లింగ వివక్ష చూపడం నేరం కూడా!

**పని ప్రదేశాల్లో రక్షణ :** పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకమైన చట్టం ఉన్నది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు గురైతే.. ఉన్నతాధికారులకు నివేదించే హక్కు మహిళలకు ఉంది. ఈ చట్టం ప్రకారం.. పనిలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించడానికి, వాటిపై విచారణ చేపట్టడానికి సంస్థలు అంతర్గత ఫిర్యాదుల



కమిటీని ఏర్పాటుచేయాలి. పది లేదా అంతకంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉన్న ప్రతి కంపెనీ.. ఈ కమిటీని ఏర్పాటు చేసుకోవాల్సిందే! ఎవరైనా మహిళా ఉద్యోగి వేధింపులకు గురైతే.. సదరు బాధితురాలు ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయవచ్చు.

**రాత్రిపూట అరెస్టు వద్దు :** సూర్యాస్తమయం తర్వాత, సూర్యోదయానికి ముందు.. మహిళలను అరెస్టు చేయకూడదు. ఏవైనా తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే.. ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదేశంతో మాత్రమే రాత్రి సమయంలో మహిళలను అరెస్టు చేయడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, మహిళా ఖైదీని ప్రశ్నించే సమయంలో మహిళా కానిస్టేబుల్ తోపాటు మహిళకు చెందిన కుటుంబసభ్యులు లేదా స్నేహితులు కూడా ఆమె పక్కన ఉండొచ్చు.

**అజ్ఞాతం.. మీ హక్కు:** లైంగిక వేధింపులకు గురైన మహిళలకు.. ‘గోప్యత హక్కు’ ఉంటుంది. దీని ప్రకారం.. బాధితురాలి పేరు, ఇతర వివరాలను బయటికి వెల్లడించకూడదు. మేజిస్ట్రేట్ ఎదుట ఒంటరిగా లేదా మహిళా పోలీసు అధికారి సమక్షంలో తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకునే హక్కు బాధితురాలికి ఉంటుంది.

**ఉచిత న్యాయ సేవ :** లీగల్ సర్వీసెస్ అథారిటీస్ యాక్ట్.. అత్యాచార బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తుంది. మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు న్యాయ సహాయం పొందడానికి ఈ చట్టం హామీ ఇస్తుంది.

**గౌరవానికి భంగం వద్దు! :** లైంగిక వేధింపుల బాధితురాలికి.. తన గౌరవానికి భంగం కలగకుండా చూసుకొనే హక్కు ఉంటుంది. దీని ప్రకారం.. ఏదైనా వైద్య పరీక్షలు అవసరమైతే కేవలం మహిళా వైద్యురాలి ద్వారానే పరీక్షలు నిర్వహించాలి. ఇతరుల సమక్షంలో ఏ విధమైన శారీరక/ మానసిక పరీక్షలు నిర్వహించడం చట్టవిరుద్ధం.

## ‘ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరు?’

**మంగళగిరి:** “రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరు?” అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. “వైకాపా నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం. పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం” అని పవన్ కల్యాణ్ చెప్పారు.




